సాక్షి వరంగల్

శనివారం | 3 | మే | 2025



..పోస్టులపై తిరకాసు

అన్‌యూజ్డ్ పోస్టులను ఉన్నతీకరించడంపై తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ కార్మికశాఖకు ఫిర్యాదు చేసింది.

- 10లో▸



దేవాదుల.. పరిష్కారమెలా?

భూసేకరణ పూర్తి కాకపోవడంతో దేవాదుల మూడో దశ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. శనివారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టుపై సమీక్షించనున్నారు.

- 10లో▸

గరిష్టం/కనిష్టం

39°/28°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్న సమయంలో ఎండ ఉంటుంది. సాయంత్రం వేళ అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

గాలివాన బీభత్సం

- కల్లాల్లో తడిసిన ధాన్యం, మక్కలు, మిర్చి
- నేలవాలిన వరి పంటలు.. అన్నదాతలకు నష్టం
- విరిగిపోయిన 45 విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు
- నర్సంపేట, మనుబోతులగడ్డలో రోడ్డుపై పడిపోయిన చెట్లు



ఖానాపురం మండలం మనుబోతులగడ్డ శివారులో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన భారీ వృక్షం

నర్సంపేట: జిల్లాలో గురువారం అర్ధరాత్రి ఒక్కసారిగా గాలివాన బీభత్సం సృష్టించింది. రాత్రి 12 గంటల కురిసిన భారీ వర్షం అతలాకుతలం చేసింది. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, మక్కలు, మిర్చి తడిసి ముద్దయ్యాయి. పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. గీసుకొండ మండలం కొనాయమాకులోని ఓ వెంచర్‌లో, నర్సంపేట పట్టణంలోని శివాంజనేయ స్వామి ఆలయం సమీపం, ఖానాపురం మండల కేంద్రం–మనుబోతులగడ్డ ప్రధాన రహదారిలో చెట్లు కూలిపోయాయి. పడిపోయిన చెట్లను అధికారులు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

పాపయ్యపేటలో కొట్టుకుపోయిన ఇంటి రేకులు



కొట్టుకుపోయిన రేకులను చూపిస్తున్న ఖాజాపాషా

ఈదురు గాలులకు ఇంటి రేకులు కొట్టుకుపోయిన సంఘటన చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట గ్రామంలో జరిగింది. ఈదురు గాలులకు షేక్ ఖాజాపాషాకు చెందిన చికెన్ షాపుపై రేకులు కొట్టుకుపోయాయి. సుమారు రూ.రెండు లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు ఖాజాపాషా తెలిపాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరాడు.

చేతికందే సమయానికి వరి పంట వర్షార్పణం



ఖానాపురం మండలం కొత్తూరు శివారులో నేలవాలిన వరి పంట చూపిస్తున్న రైతు కోటి

చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట, తిమ్మరాయినిపహాడ్, బోజెర్వు, అమీనాబాద్, బాపునగర్, లింగగిరి, ఎల్లాయిగూడెం, ఖానాపురం మండలం మనుబోతులగడ్డ, ఖానాపురం, బుధరావుపేట, అశోక్‌నగర్, కొత్తూరు తదితర గ్రామాల్లో ఈదురు గాలులకు చేతికొచ్చిన పంటలు నేలమట్టమయ్యాయి. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేస్తే చేతికందే సమయానికే నేలమట్టం కావడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. గాలివానతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఖానాపురం మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు డిమాండ్ చేశారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు..



నర్సంపేట పట్టణంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న సిబ్బంది

ఈదురు గాలులకు విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా 45 స్తంభాలు నేలకొరిగాయి. దుగ్గొండి మండలం తిమ్మంపేటలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు విరిగిపోయాయి. శుక్రవారం నర్సంపేట పట్టణంతో పాటు మండలం, ఖానాపురం, నల్లబెల్లి, దుగ్గొండి, చెన్నారావుపేట మండలాల్లో ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆపరేషన్ టి.మధుసూదన్, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, ఇతర అధికారులు కంట్రోల్ రూం నుంచి నిరంతరం పర్యవేక్షించారు. కార్యక్రమంలో వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కాసిడి గౌతంరెడ్డి, టెక్నికల్ డీఈ అన్నమల్ల ఆనంద్, నర్సంపేట డీఈ పెంథోట తిరుపతి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



నాగుర్లపల్లిలో వర్షానికి తడిసిన ధాన్యం

విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి



దుగ్గొండి: తిమ్మంపేటలో విరిగిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ గౌతంరెడ్డి

ఖానాపురం/దుగ్గొండి/గీసుకొండ : విద్యుత్ సమస్యలు లేకుండా చూసుకోవాలని ఎస్ఈ గౌతమ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గాలివానతో ఖానాపురం మండలంలో 12 విద్యుత్ స్తంభాలు, దుగ్గొండి మండంలోని తిమ్మంపేటలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, 7 స్తంభాలు, గీసుకొండ మండలంలోని కాకతీయ కెనాల్, మనుగొండ, కొనాయమాకులలో నాలుగు స్తంభాలు విరిగిపోయాయి. శుక్రవారం ఆయన వాటిని పరిశీలించి నష్టం అంచనా వేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. ఎస్ఈ వెంట డీఈ తిరుపతి, ఏడీఈ రాజేశ్, ఏఈలు మంగమ్మ, ప్రత్యూష, లైన్ ఇన్‌స్పెక్టర్ అజీంపాషా, ఎల్ఎంలు దేవేందర్‌రావు, రాజు తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

ప్రతీ రైతుకు ప్రత్యేక యూనిక్ ఐడీ

- వ్యవసాయ శాఖ డైరెక్టర్ వి.గోపి

వర్ధన్నపేట: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రైతు నమోదు కార్యక్రమం ద్వారా ప్రతీ రైతుకు ప్రత్యేక యూనిక్ ఐడీ ఇవ్వనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ వి.గోపి అన్నారు. హైదరాబాద్ నుంచి ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ జిల్లా వ్యవసాయాధికారి కె.అనురాధ, వర్ధన్నపేట ఏడీఏ నర్సింగం, ఏఓ విజయకుమార్, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ యూనిక్ ఐడీతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి అల్దాస్ జానయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఈ నెల 5వ తేదీ నుంచి 14 వరకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నీట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం: కమిషనరేట్ పరిధిలో ఈనెల 4న (ఆదివారం) జరిగే నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 13 పరీక్ష కేంద్రాలున్నాయని, ఇందులో వరంగల్, హనుమకొండలో 11, జనగామలో 2 పరీక్ష కేంద్రాలున్నట్లు తెలిపారు. వరంగల్, హనుమకొండ పరిధిలో 4,680 మంది, జనగామలో 580 మంది విద్యార్థులు మొత్తం 5,260 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తుతో పాటు సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలు, ధర్నాలు, గుంపులుగా తిరగడం నిషేధమని, పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసేయాలని కోరారు.

యువకుడిపై పోక్సో కేసు

నర్సంపేట: అత్యాచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారావుపేటలో అమ్మమ్మ ఇంటి దగ్గర ఉంటూ చదువుకుంటున్న ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని ఓ యువకుడు నమ్మించాడు. మరో యువతిని పెళ్లి చేసుకొని తనను మోసం చేసినట్లు యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చెన్నారావుపేట ఎస్సీ కాలనీకి చెందిన జంగిలి ప్రవీణ్‌పై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

- అవయవ దానం చేసిన కుటుంబ సభ్యులు



రమణ(ఫైల్)

వర్ధన్నపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అవయవ దానం చేశారు. వివరాలిలా ఉన్నాయి. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని నీలగిరిస్వామి తండాకు చెందిన బానోత్ రమణ (25)కు బావనికుంట తండాకు చెందిన కల్యాణితో హోలీ రోజు పెళ్లి జరిగింది. కాగా, గత శనివారం భార్య కల్యాణిని బైక్‌పై బావనికుంట తండా నుంచి తీసుకొస్తున్నాడు. రాత్రి నీలగిరిస్వామి తండాకు వెళ్తున్న క్రమంలో బావనికుంట తండా సమీపంలోని దుర్గమ్మ ఆలయం వద్ద అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి రమణ బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో రమణ తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. రమణకు బ్రెయిన్ డెడ్ కావడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు అవయవ దానం చేశారు. ఆస్పత్రి వర్గాలు ఆయనకు గౌరవ వందనం చేశాయి. మృతుడికి తల్లిదండ్రులు విజయ–దేవేందర్, ఇద్దరు సోదరులు ఉన్నారు. నీలగిరిస్వామి తండాలో తండ్రి దేవేందర్ తలకొరివి పెట్టి రమణ అంత్యక్రియలు నిర్వహించారు.

మేడారంలో పారిశుద్ధ్య పనులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ములుగు జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు శుక్రవారం పరిశీలించారు. జంపన్నవాగు స్నానఘట్టాలు, మేడారంలోని ఐలాండ్, జంపన్న వాగు నుంచి గద్దెల వరకు, అలాగే సమ్మక్క–సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు షెడ్లను పరిశీలించారు.

5 నుంచి రెవెన్యూ సదస్సులు

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్: జిల్లాలోని ఒక మండలంలో ఈనెల 5 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్‌తో కలిసి భూ భారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, నీట్, ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్లతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెల చివరి వరకు ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని, భూ సేకరణ వివరాలు అప్‌డేట్ చేయాలన్నారు. నీట్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సూచించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ గణపతి, డీఈఓ జ్ఞానేశ్వర్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

వరంగల్: జిల్లాలో ఈనెల నాలుగో తేదీన నిర్వహించనున్న నీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారద శుక్రవారం తెలిపారు. పోలీస్, విద్య, ఆర్టీసీ, విద్యుత్, వైద్య ఆరోగ్య, పోస్టల్ తదితర శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. శుక్రవారం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 240 మంది విద్యార్థులకు ఒక పరీక్ష కేంద్రం కేటాయించినట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటలకు లోపలికి అనుమతిస్తారని, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు. 1:30 గంటలకు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తారని, ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరని స్పష్టం చేశారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే పరీక్షకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావొద్దని, అడ్మిట్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, గుర్తింపుకార్డు తెచ్చుకోవాలని కలెక్టర్ కోరారు.

టెన్త్, ఇంటర్ విద్యార్థులకు సన్మానం



కలెక్టర్ సత్యశారదతో విద్యార్థులు

వరంగల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వివిధ సంక్షేమ వసతి గృహాల్లో పదో తరగతి చదివి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 45 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ సత్యశారద శుక్రవారం సన్మానించారు. పరీక్షల సమయంలో స్ఫూర్తి కార్యక్రమం ద్వారా కలెక్టర్ విద్యార్థుల్లో పరీక్షలపై భయాన్ని పోగొట్టి, ప్రోత్సహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దావత్ ఇస్తానని చెప్పిన ఆమె.. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఈఓ జ్ఞానేశ్వర్, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- జిల్లా యువజన, క్రీడల అధికారి టీవీఎల్.సత్యవాణి
- నర్సంపేట మినీ స్టేడియంలో వేసవి క్రీడా శిబిరం ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్ఓ సత్యవాణి

నర్సంపేట: విద్యార్థులు క్రమశిక్షణతో శిక్షణ శిబిరంలో పాల్గొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి టీవీఎల్.సత్యవాణి సూచించారు. నర్సంపేట మినీ స్టేడియంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం వేసవి కబడ్డీ, రెజ్లింగ్, క్రీడా శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు క్రీడా సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. భవిష్యత్‌లో మంచి క్రీడాకారులుగా రాణించాలని కోరారు. మినీ స్టేడియానికి ప్రభుత్వం నుంచి మంజూరైన కబడ్డీ, రెజ్లింగ్ క్రీడా మ్యాట్లను త్వరలోనే అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీ సోనబోయిన సారంగపాణి, రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గుండేటి రవీందర్ గౌడ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి ఈసాల లక్ష్మయ్య, రగ్బీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఉడుతల శ్రీకాంత్‌ముదిరాజ్, స్టేడియం ఇన్‌చార్జ్, కబడ్డీ కోచ్ యాట రవికుమార్, స్టేడియం ఇన్‌చార్జ్ రెజ్లింగ్ కోచ్ సిరపురపు మహేశ్, అథ్లెటిక్స్ కోచ్ ఉరుసుల శేఖర్‌యాదవ్, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు వరప్రసాద్, పుల్లూరి సుమన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

'పూల'కింత..



నెక్కొండ–మహబూబాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా గుల్మోరా చెట్లు ఆకట్టుకుంటున్నాయి. విరగబూసిన పూలతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. హరితహారంలో భాగంగా అప్పటి నెక్కొండ మేజర్ గ్రామ సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా కడియం నుంచి మొక్కలను తీసుకొచ్చి నెక్కొండ ప్రధాన రహదారికి ఇరువైపులా నాటించారు. అవి చెట్లుగా పెరిగి మండల కేంద్రంలో ఎర్రని పూలతో చూపరులను కట్టిపడేస్తున్నాయి

– నెక్కొండ

సివిల్ సప్లయీస్‌కు 'సీఎంఆర్' చిక్కులు

- పెండింగ్‌లో గత రబీ, ఖరీఫ్ సీఎంఆర్ బియ్యం
- లక్ష్యానికి దూరంగా చాలామంది రైస్ మిల్లర్లు
- గడువు పెంచినా కదలని సీఎంఆర్ బకాయి
- ఊపందుకున్న రబీ ధాన్యం కొనుగోళ్లు
- డిఫాల్టర్లకు సీఎంఆర్ ఇవ్వద్దని సర్కారు ఆదేశం..
- 'ప్రత్యామ్నాయం'పై కసరత్తు

సాక్షిప్రతినిధి, వరంగల్:

- హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని ఓ రైస్‌మిల్లుకు 2021–22, 2022–23 సంవత్సరాలకు కేటాయించిన సీఎంఆర్ కింద 4,310 మె.టన్నుల బియ్యానికి 1,889 మె.టన్నులు మాత్రమే సరఫరా చేశారు. సుమారు రూ.7.50 కోట్ల విలువైన బియ్యం ఎగవేయడంతో అప్పట్లో సివిల్ సప్లయీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి బియ్యం లేకపోవడంతో కేసులు నమోదు చేసి డిఫాల్టర్ లిస్టులో చేర్చారు.
- మహబూబాబాద్ జిల్లాలోని మూడు మిల్లుల్లో గత సీజన్‌లో రూ.30.38 కోట్ల విలువైన 1,13,796 క్వింటాళ్ల ధాన్యం దారి మళ్లించినట్లు తేలింది. అదేవిధంగా కేసముద్రం విలేజ్ గ్రామంలోని రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.30 కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించి కేసులు పెట్టారు.

ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద రైస్ మిల్లర్లకు సరఫరా చేయాల్సి ఉండగా.. ఈసారి డిఫాల్టర్లకు ఇవ్వొద్దని ప్రభుత్వం నుంచి కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. 20 శాతం మిల్లర్లు ఈ జాబితాలో ఉండే అవకాశం ఉంది. సివిల్ సప్లయీస్ అధికారులు వాటిపై పునరాలోచన చేస్తూ మిగతా మిల్లర్లకు ధాన్యం ఇస్తున్నారు.



ధాన్యం దిగుబడుల అంచనాకు అనుగుణంగా ఉమ్మడి వరంగల్‌లో 987 కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల శాఖ ప్రతిపాదించింది. ఈ మేరకు జిల్లాల వారీగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో పాక్షికంగా సాగుతుండగా.. మిగతా జిల్లాల్లో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ధాన్యం అమ్ముకుంటున్న రైతులకు ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎంఎస్) ద్వారా డబ్బు బ్యాంకు అకౌంట్లలో జమ చేస్తున్నారు.

దాడులు, కేసులు పెట్టినా అదే మొండివైఖరి..

సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని పలు జిల్లాల్లో కొందరు రైస్ మిల్లర్లు పక్కదారి పట్టించారు. రాష్ట్ర వ్యాప్తంగా పౌరసరఫరాలశాఖ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మూకుమ్మడి తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. గత రబీ సీజన్‌లో సీఎంఆర్ కోసం కూడా హనుమకొండ, వరంగల్, జేఎస్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లోనూ ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లాలోని మూడు మిల్లుల్లో రూ.30.38 కోట్ల విలువైన 1,13,796 క్వింటాళ్ల ధాన్యం దారి మళ్లించినట్లు తేలింది. వరంగల్ జిల్లాలోని ఓ మిల్లులో రూ.3.79 కోట్ల విలువైన 12,360 క్వింటాళ్లు పక్కదారి పట్టినట్లు గుర్తించి కేసు పెట్టారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్‌లో జరిపిన తనిఖీల్లో ఆరేడు సంవత్సరాలకు సంబంధించిన రూ.201 కోట్లకు పైగా విలువైన బియ్యం బకాయి ఉన్నట్లు వెల్లడించారు. కాగా, ఇప్పటికే డిఫాల్టర్ జాబితాలో ఉన్న పలువురికి నోటీసులు జారీ చేశామని, 6ఏ కేసులు కూడా నమోదు చేశామని, అవసరమైతే రెవెన్యూ రికవరీ యాక్టు కూడా పెడతామని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

రబీ సీజన్ సీఎంఆర్ ఆచితూచి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాయిల్డ్, రా రాస్ మిల్లులు 328 వరకు ఉన్నాయి. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, జనగామ, భూపాలపల్లి జిల్లాల్లోని మిల్లుల నుంచి బకాయిలు సుమారు లక్షా 20వేల మెట్రిక్ టన్నుల పైచిలుకు రావాల్సి ఉందని ఫైనల్‌గా తేల్చారు. సీఎంఆర్ బకాయి ఉన్న డిఫాల్టర్లకు ఈ సీజన్‌లో ధాన్యం ఇవ్వరాదన్న ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ సీజన్ 10.24 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేసిన అధికారులు 987 కొనుగోలు కేంద్రాల కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇన్‌టైంలో సీఎంఆర్ ఇచ్చిన మిల్లర్లకే సరఫరా చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. డిఫాల్టర్‌గా ఉన్న రైస్ మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని సకాలంలో సీఎంఆర్ ఇచ్చిన మిల్లర్లకు తరలించడమా... లేక ఈ సీఎంఆర్ బకాయి రాబట్టుకుని అదనంగా జమానత్‌లు తీసుకుని వారికే ఇవ్వడమా... అన్న కోణంలో కసరత్తు చేస్తున్నారు.

పోలీస్ కుటుంబాలకు భద్రత చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం : కమిషనరేట్ పరిధిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ పలు కారణాలతో గత ఏడాది మరణించిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు భద్రత విభాగం మంజూరు చేసిన చెక్కులను శుక్రవారం వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ అందజేశారు. కానిస్టేబుల్ నర్సింహస్వామి కుటుంబానికి రూ.7,36,830, మరో కానిస్టేబుల్ కిరణ్ కుమార్ కుటుంబానికి రూ.5.87 లక్షల విలువైన చెక్కులను సీపీ అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, ఏఓ రామకృష్ణస్వామి, సూపరింటెండెంట్ రమాదేవి పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు షురూ

గీసుకొండ: మండలంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సేకరించిన భూమిలో బొడ్డుచింతలపల్లి నుంచి మనుగొండ వరకు ఇరువైపులా ట్రెంచ్ (కందకం) తీసే పనులను శుక్రవారం ప్రారంభించారు. బొడ్డుచింతలపల్లి పరిధిలోని 1.7 కిలోమీటర్ల పొడువులో 11.23 ఎకరాలు, మనుగొండ పరిధిలోని 1.6 కిలోమీటర్లలోని 31.20 ఎకరాల భూమిలో ట్రెంచ్ కొట్టే పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలో సుమారు మూడున్నర కిలోమీటర్ల పొడవులో 150 అడుగుల వెడల్పులో నాలుగు లేన్లుగా గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. బొడ్డుచింతలపల్లి, మనుగొండ తర్వాత గీసుకొండలో 24.03, మచ్చాపూర్‌లో 13.22, ఊకల్‌లో 29.19.. ఇవన్నీ కలిపి సుమారు 110.05 ఎకరాల్లో హైవే నిర్మించనున్నారు. నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు 457 కిలోమీటర్ల పొడవులో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించడానికి కేంద్రం ప్రణాళిక రూపొందించింది. మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల నుంచి ఈ ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మిస్తున్నారు. ఈ పనులను 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కార్యక్రమంలో గీసుకొండ తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్, ఏనుమాముల సీఐ రాఘవేందర్‌రావు, గీసుకొండ ఎస్సై ప్రశాంత్, ఆర్ఐలు సాంబయ్య, శ్రీధర్, కాంట్రాక్టర్ అమర్‌నాథ్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా ట్రెంచ్ పనులకు ముగ్గు పోస్తున్న అధికారులు

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల మూల్యాంకనం

విద్యారణ్యపురి : తెలంగాణ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం హనుమకొండలోని తోటబడిలో నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పలు మూల్యాంకనం కేంద్రాలుగా ఉండగా అందులో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని హనుమకొండలో తోటబడిని ఎంపిక చేశారు. ఈనెల 5నుంచి 7వతేదీ వరకు టెన్త్ పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనం, 8నుంచి 10వతేదీవరకు ఇంటర్మీడియట్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం జరుగుతుందని ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ అనగోని సదానందం శుక్రవారం తెలిపారు. ఈ కేంద్రానికి టెన్త్ పరీక్షల జవాబు పత్రాలు 9,379 ఉండగా, ఇంటర్మీడియట్ పరీక్షల జవాబుపత్రాలు 16,286 కేటాయించారు. చీఫ్ ఎగ్జామినర్లుగా 13మంది, ఏఈలుగా 77మంది ఉపాధ్యాయులను, స్పెషల్ అసిస్టెంట్లుగా 13 మందిని నియమించామని సదానందం చెప్పారు.

భగవత్ భక్తే ప్రధాన మార్గం

హన్మకొండ కల్చరల్: పరమాత్ముడి సృష్టి మోక్షాన్ని పొందడానికి భగవత్ భక్తే ప్రధాన మార్గమని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. శుక్రవారం జగద్గురు ఆదిశంకరులు, శ్రీమద్ రామానుజాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. వేయిస్తంభాల ఆలయ ఆవరణలోని 'కుడా' గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వేదికపై ఆదిశంకరులు, రామానుజాచార్యుల చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి, ధన్వంతరి సేవా సమితి ఆధ్వర్యంలో గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ 'కుడా' గార్డెన్స్‌లో భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్డు నిర్మిస్తామని అన్నారు.

అన్‌యూజ్డ్ పోస్టులపై తిరకాసు

వర్క్‌మెన్ పోస్టులు ఉన్నతీకరించడంతో వ్యతిరేకత

- కార్మిక శాఖకు ఫిర్యాదు.. 9న జాయింట్ మీటింగ్
- సబ్ స్టేషన్లలో ఆపరేటర్ల కరువు
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు



హన్మకొండ : అన్‌యూజ్డ్ పోస్టులను ఉన్నతీకరించడంపై కార్మిక శాఖ విచారణ చేపట్టడంతో ఈ వివాదం ఎటువైపు తిరుగుతుందోనని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో విస్తృత చర్చ సాగుతోంది. వర్క్‌మెన్ క్యాడర్ పోస్టులను ఉన్నతాధికారుల పోస్టులుగా ఉన్నతీకరించడం వివాదస్పదంగా తయారైంది. విద్యుత్ ఉద్యోగులతో పాటు, కొన్ని విద్యుత్ ఉద్యోగ సంఘాలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. అన్‌యూజ్డ్ పోస్టులను ఉన్నతీకరించడంపై తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ కార్మిక శాఖకు ఫిర్యాదు చేసింది. అన్‌యూజ్డ్‌గా ఉన్న వర్క్‌మెన్ పోస్టులను రెగ్యులర్ పోస్టులుగా క్షేత్ర స్థాయిలో భర్తీ చేసి భారం తగ్గించాలని ఉద్యోగ సంఘాలు కోరితే ఇందులో కొన్నింటిని వర్క్‌మెన్‌గా, మరికొన్నిటిని పీ అండ్ జీ, ఇంజనీర్స్, అకౌంట్స్ విభాగం అధికారులకు పదోన్నతులకు అనుగుణంగా ఉన్నత స్థాయి పోస్టులు సృష్టిస్తూ నిర్ణయం తీసుకున్నారని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గన్‌మ్యాన్, టెలిఫోన్ బాయి, కార్పెంటర్, సివిల్ మేస్త్రీ, స్టోర్ కీపర్, టెలిఫోన్ ఇన్‌స్పెక్టర్, టెలిఫోన్ ఆపరేటర్, టూల్ కీపర్ వంటి 215 పోస్టులు వృథాగా ఉంటున్నాయి. ఈ పోస్టులను భర్తీ చేయకుండా ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టులపై భారం పడుతోంది.

- కొన్నేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న 215 అన్‌యూజ్డ్ పోస్టులతో పాటు, ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల 200 పోస్టులు.. మొత్తం 415 పోస్టుల స్థానంలో చీఫ్ ఇంజనీర్, సీజీఎం (అకౌంట్స్), జాయింట్ సెక్రటరీ (పీ అండ్ జీ), జనరల్ మేనేజర్ (పీ అండ్ జీ), అకౌంట్స్ ఆఫీసర్ ఒక్కో పోస్టు చొప్పున, ఎస్ఈ, డీఈ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, వాచ్‌మెన్ పోస్టులు నాలుగు చొప్పున, రెండు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, ఆరు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, సబ్ ఇంజనీర్ పోస్టులు 16 చొప్పున, 20 జూనియల్ అకౌంట్స్ ఆఫీసర్, 88 సీనియర్ అసిస్టెంట్, 32 సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, 48 అసిస్టెంట్ లైన్‌మెన్, 88 ఆఫీస్ సబార్డినేట్, ఆరు స్వీపర్ పోస్టులుగా మార్చినట్లు సమాచారం. 415 పోస్టుల స్థానంలో కొత్తగా 339 పోస్టులుగా స్థిరీకరించారు.
- ఈ నేపథ్యంలో చీఫ్ ఇంజనీర్, సీజీఎం (అకౌంట్స్), జాయింట్ సెక్రటరీ (పీ అండ్ జీ), జనరల్ మేనేజర్ (పీ అండ్ జీ), అకౌంట్స్ ఆఫసర్ ఒక్కో పోస్టు చొప్పున, ఎస్ఈ, డీఈ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, వాచ్‌మెన్ పోస్టులు నాలుగు చొప్పున, రెండు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, ఆరు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, సబ్ ఇంజనీర్ పోస్టులు 16 చొప్పున కొత్తగా పోస్టులు సృష్టించడాన్ని క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న వర్క్‌మెన్ క్యాడర్ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో యూనియన్ నాయకులు మూడు నెలల క్రితం కార్మిక శాఖకు ఫిర్యాదు చేయగా దీనిపై వివరణ ఇవ్వాలని లేఖ రాసినా స్పందించలేదు. దీంతో ఈ నెల 9న జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసినట్లు కార్మిక శాఖ వరంగల్ జోన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.రాజేంద్ర ప్రసాద్ టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. అన్‌యూజ్డ్ పోస్టుల వ్యవహారం ఎటువైపు తిరుగుతుందో అని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

ఉద్యోగులపై అదనపు భారం

టీజీ ఎన్పీడీసీఎల్‌లో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు 932 ఖాళీగా ఉండగా 25 నెలల క్రితం 100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి ఇటీవల 93 పోస్టులు భర్తీ చేశారు. కోర్టులో కేసు కారణంగా మిగతా పోస్టులు భర్తీ చేయలేదు. మిగిలిన 839 పోస్టుల్లో 200 పోస్టులకు కోత పెట్టి ఉన్నత స్థాయి పోస్టులుగా సృష్టించి ప్రభుత్వ అమోదానికి పంపినట్లు సమాచారం. కొత్త సబ్ స్టేషన్‌లు నిర్మించినా ఆ మేరకు ఆపరేటర్ల నియామకం చేపట్టకపోవడంతో అందుబాటులో ఉన్న ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులపై భారం పడుతోందని, కొన్ని సబ్‌స్టేషన్‌లలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తూ నిర్వహణను నెట్టుకొస్తున్నారు.

అమ్మానాన్నే నాకు ప్రేరణ..

కుటుంబ సహకారంతోనే విజయం

'మా కుటుంబం న్యాయవిద్యతో ముడిపడినందుకు నాకు ఎంతో గర్వంగా ఉంది. చిన్ననాటి నుంచి న్యాయశాస్త్రాన్ని చూసి పెరిగిన నేను, ఇప్పుడు అదే కుటుంబ పరంపరలో భాగంగా న్యాయం కోసం పనిచేయడం ఎంతో సంతృప్తిగా ఉంది. ఇది నాకు బాధ్యతను గుర్తు చేస్తోంది, ఈ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్న కర్తవ్యం కలిగిస్తోంది.' అని అంటున్నారు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన దారా మేఘన. ఇటీవల వెలువడిన న్యాయశాస్త్ర ఫలితాల్లో వరంగల్ దర్గా కాజీపేటకు చెందిన మేఘన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీనుంచి 2023 న్యాయ శాస్త్రం పట్టా పొంది న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. మొదటి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె ప్రయాణంపై 'సాక్షి' పలకరించగా పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. -వరంగల్ లీగల్



- దారా మేఘన

- మా నాన్న నల్సార్ విశ్వవిద్యాలయంలో లా ప్రొఫెసర్..
- తరచూ అక్కడి వాతావరణాన్ని చూపించేవారు..
- 'సాక్షి'తో దారా మేఘన
- ఇటీవల న్యాయశాస్త్ర ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక

ప్రశ్న: ఎల్ఎల్‌బీని ఎందుకు ఎంచుకున్నారు?

జవాబు : నేను న్యాయశాస్త్రాన్ని ఎంచుకోవడానికి కారణం మా నాన్నగారు. తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడే న్యాయవిద్యను నా వృత్తిగా చేసుకోవాలని నిర్ణయించుకున్నా. జీవితమంతా ఆయన నాకు మోటివేషన్‌గా నిలిచారు. మా నాన్న నల్సార్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచే నాకు లా స్కూల్ వాతావరణాన్ని, విద్యార్థులను చూడగల అవకాశం కలిగింది. ఇదంతా న్యాయశాస్త్రం పట్ల నాలో ఆసక్తిని, అభిమానం పెంచింది.

ప్ర : మీకు ప్రేరణ ఎవరు.

జ : మా తల్లిదండ్రులే నాకు ప్రేరణ. మా నాన్న న్యాయశాస్త్ర ప్రొఫెసర్, అమ్మ ఎల్ఐసీలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్‌గా ఉన్నారు. వారి శ్రద్ధ, క్రమశిక్షణ నన్ను జీవితాన్ని సరిగ్గా ముందుకు నడిపించడంలో కలిసి వచ్చింది. ఏ రంగాన్ని ఎంచుకున్నా, దానికి ప్రోత్సాహం, స్వేచ్ఛను ఇచ్చారు. ఇక తమ్ముడు వంశీకృష్ణ ఎప్పుడూ నాకు మద్దతుగా నిలిచి, విద్యార్థినిగా ఎదుర్కొన్న కష్టాల్లో తోడుగా ఉన్నాడు. అలాగే, ప్రముఖ సీనియర్ అడ్వొకేట్ సి.విద్యాసాగర్ రెడ్డితో పనిచేసే అవకాశం నాకు లభించింది. ఆయన నుంచి న్యాయశాస్త్రం ప్రాయోగిక అంశాల్లో మార్గదర్శనం పొందాను. ఈ రంగాన్ని ఎంపిక చేసుకోవాలని ఆయన అప్పట్లో ఇచ్చిన సలహా నా జీవితంపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది. ఇంకా, మా కళాశాల నుంచి పెద్దగా విజయాలు సాధించిన మా సీనియర్లు తరణి వేముగంటి, నేహా అగర్వాల్ విజయాలను దగ్గరగా చూసే అవకాశం లభించింది. తరణి ప్రస్తుతం సిద్దిపేటలో జూనియర్ సివిల్ జడ్జిగా, అదనపు జేఎంఎఫ్‌సీగా పనిచేస్తున్నారు. నేహా అగర్వాల్ డీఎస్పీ పదవిని పొందారు. వారి మాటలు నాకు దిక్సూచి చూపాయి.

ప్ర : ఎందుకు న్యాయవాద వృత్తిని ఎంచుకున్నారు.

జ : న్యాయశాస్త్రం ద్వారా న్యాయం సాధించడమే కాక సమాజానికి సేవ చేయవచ్చని నమ్మి ఈ మార్గాన్ని ఎంచుకున్నాను

ప్ర : మీరు ఎదుర్కొన్న సవాళ్లు.

జ : నా ప్రయాణంలో ఒత్తిడి, ఆందోళన ఎదుర్కోవాల్సి వచ్చింది. సమయం కూడా చాలా పరిమితంగా ఉండటంతో, ఆ సమయంలోనే అన్ని విభాగాలను కవర్ చేయాలన్న ఒత్తిడితో ఉన్నా. ఇదే సమయంలో, మా తమ్ముడు అమెరికాకు మాస్టర్స్ కోసం వెళ్లిపోవడం కూడా నాకు భావోద్వేగపూరితంగా కష్టంగా అనిపించింది. అయితే, నా స్నేహితులు, కుటుంబ సభ్యులు అండగా నిలిచి నా అడ్డంకులను అధిగమించడంలో సహాయం చేశారు.

ప్ర : మీ నెక్స్ట్ గోల్?

జ : ఇప్పటినుంచి నా లక్ష్యం అత్యంత నిజాయితీగా, సమగ్రతతో సేవ చేయడం. న్యాయం వేగంగా అందించడానికీ, ఆలస్యం లేకుండా ప్రజలకు న్యాయం చేసేందుకు కట్టుబడి పని చేయాలనుకుంటున్నాను. నాకు అండగా నిలిచిన తల్లిదండ్రులు, తమ్ముడికి, స్నేహితులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా. ఈ విజయాన్ని నాతో కలిసి పంచుకున్న బంధువులకు కూడా ధన్యవాదాలు.



'జంపన్న'కు జలకళ

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారంలోని జంపన్న వాగు నీటితో కళకళలాడుతోంది. గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో జంపన్న వాగులోకి వరద చేరింది. మొన్నటి వరకు చుక్కనీరు లేక ఎండిపోయి..ఇసుక దిబ్బలను తలపించింది. ఎగువ ప్రాంతంలో ఒక్కసారిగా వర్షం పడడంతో జంపన్నవాగులోకి వరద చేరి జలకళ సంతరించుకుంది. శుక్రవారం అమ్మవార్లను దర్శించుకునేందుకు మేడారానికి వచ్చిన భక్తులు జంపన్న వాగు నీటిలో పుణ్యస్నానాలు ఆచరించి పులకించిపోయారు. జంపన్న వాగులోకి వరద ప్రవహిస్తుడడంతో భక్తులు స్నానాలు ఆచరించే క్రమంలో ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా జంపన్నవాగులో ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయాలని పూజారులు కోరుతున్నారు.

బక్కమ్మ@105



- బక్కమ్మ



బక్కమ్మ జన్మదిన వేడుకల్లో కుటుంబ సభ్యులు

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి 105వ జన్మదిన సంబరాన్ని కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్వాతంత్య్ర సమరయోధురాలైన చీమల బక్కమ్మ 104 సంవత్సరాల వయస్సును పూర్తి చేసుకుని 105వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కుటుంబ సభ్యులంతా ఒక్కతాటిపైకి చేరుకుని శుక్రవారం గ్రామంలో ఆనందోత్సవాల నడుమ జన్మదినాన్ని నిర్వహించారు. బక్కమ్మకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. వీరి తరపు కుటుంబమంతా (121) మంది బుధరావుపేటలో శుక్రవారం కలుసుకుని జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ఐస్‌క్రీమ్ పార్లర్‌పై దాడులు



దాడిలో పాల్గొన్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కాజీపేట : కాజీపేట పట్టణంలో పర్వతలాల్ ఐస్‌క్రీమ్ తయారీ, డిస్ట్రిబ్యూటర్ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు ఐస్‌క్రీమ్ పార్లర్‌పై దాడులు చేసి రూ.29,050 విలువ చేసే ఐస్‌క్రీమ్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాణ్యత పాటించకుండా ఐస్‌క్రీమ్‌ల తయారీ, గడువు తీరిన ఐస్‌క్రీమ్‌లు, పాడైన ఐస్‌క్రీమ్‌లను పట్టుకున్నారు. దుకాణం యజమాని నమ్తాబాద్ అమర్‌నాథ్‌పై తదుపరి చర్యల నిమిత్తం ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు.

దేవాదుల.. పరిష్కారమెలా?

నేడు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్ష

- మూడో దశలో భూసేకరణే అసలు సమస్య..
- దేవన్నపేట పంపుహౌస్, ధర్మసాగర్ సందర్శన

సాక్షి ప్రతినిధి, వరంగల్ : జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం 91 శాతం పూర్తయినా.. మూడో దశలో భూసేకరణతో పనులు ముందుకు సాగక అసంపూర్తిగా మిగిలుతోంది. ఏడాదిలో 300 రోజులు 60 టీఎంసీల నీటిని వినియోగించుకుని తొమ్మిది జిల్లాల్లో 5.57 లక్షల ఎకరాలకు నీరందించే ఈ పథకానికి పూర్తి స్థాయిలో మోక్షం కలగడం లేదు. గతేడాది ఆగస్టు 31న కన్నాయిగూడెం బ్యారేజీ వద్ద మంత్రులు, కలెక్టర్లు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. ఆర్థిక ఇబ్బందులున్నా అధిగమించి 2026 మార్చిలోగా ఈ పథకాన్ని పూర్తి చేస్తామని ప్రకటించారు. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు జిల్లాలతో పాటు కరీంనగర్, సిద్దిపేట, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లోని 37 మండలాల్లో 5,56,722 ఎకరాలకు నీరిందించడం ఈ పథకం లక్ష్యం.

భూసేకరణే ప్రధాన సమస్య..

ఇప్పటి వరకు 3,16,634 ఎకరాల ఆయకట్టు సాగులోకి రాగా, మరో 2,40,088 ఎకరాల ఆయకట్టుకు నీరందాల్సి ఉంది. అయితే మూడో దశలో నిలిచిపోయిన భూసేకరణ కారణంగా ఈ ప్రాజెక్టు 20 ఏళ్లయినా అసంపూర్తిగానే ఉంటుంది. రైతులు ఎక్కువ పరిహారాన్ని డిమాండ్ చేయడం, కోర్టు కేసులు వంటివి భూసేకరణకు అడ్డంకిగా మారాయి.

పెరుగుతున్న ప్రాజెక్టు అంచనా వ్యయం..

యాసంగి పంటలను కాపాడేందుకు ధర్మసాగర్ రిజర్వాయర్ ద్వారా స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాలకు నీరందించే సందర్భంలో పలుమార్లు మోటార్లు మొరాయించాయి. ఇదిలా ఉండగా 2004లో రూ.6,016 కోట్లున్న అంచనా వ్యయం, 2020 జూన్ నాటికి రూ.14,729.98 కోట్లకు పెరిగింది. 2023లో రూ.17,500 కోట్ల చేరుతుందని అంచనా వేశారు. ఫలితంగా ప్రాజెక్టు అంచనా వ్యయం కూడా విపరీతంగా పెరుగుతోంది. కాగా ప్రాజెక్టు పూర్తి భూసేకరణే అసలు సమస్యగా మారగా, 33,224 ఎకరాలకు 30,268 ఎకరాలు పూర్తి చేశారు. జనగామలో 945 ఎకరాలు, పాలకుర్తిలో 826, గజ్వేల్‌లో 230, నర్సంపేటలో 131, వర్ధన్నపేటలో 168 ఎకరాలు.. ఇలా మొత్తంగా 2,957 ఎకరాల సేకరణపై చిక్కుముడి వీడితే ప్రాజెక్టు పూర్తికి మార్గం సుగమం కానుంది.

నేడు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రివ్యూ..

రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి శనివారం దేవాదుల ప్రాజెక్టుపై కీలక సమీక్ష నిర్వహించేందుకు వరంగల్‌కు వస్తున్నారు. మధ్యాహ్నం 1:45 గంటల నుంచి 2:15 గంటల వరకు దేవన్నపేట పంప్ హౌజ్‌పై రివ్యూ చేయనున్నారు. అనంతరం 2:30 నుంచి 2.45 గంటల వరకు ధర్మసాగర్ రిజర్వాయర్ సిస్టర్న్, డెలివరీ టన్నెల్ పనులపై, 3గంటల నుంచి 3:30 గంటల వరకు వరద నియంత్రణ, భద్రకాళి చెరువు పూడిక తీత పనులపై సమీక్ష చేయనున్నారు. అలాగే 3:30 గంటల నుంచి 5:30 గంటల వరకు పురోగతిలో ఉన్న నీటి పారుదల శాఖ పనులు, పౌర సరఫరాల శాఖ సమస్యలపై ఉమ్మడి వరంగల్‌కు చెందిన అధికారులతో హనుమకొండ కలెక్టరేట్‌లో రివ్యూ చేయనున్నారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా హనుమకొండ నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

డంపింగ్ యార్డులో మగశిశువు మృతదేహం



శిశువు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

మడికొండ : మడికొండ–రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డులో నవజాత శిశువు మృతదేహం లభించినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ శుక్రవారం తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. డంపింగ్ యార్డులో పని చేస్తున్న సిబ్బందికి శిశువు మృతదేహం కనిపించగా మడికొండకు చెందిన బైరి లింగమూర్తికి సమాచారం ఇచ్చారు. లింగమూర్తి వెంటనే ఇన్‌స్పెక్టర్ కిషన్‌కు విషయం తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న కిషన్ మృతదేహాన్ని పరిశీలించి చనిపోయినది మగ శిశువుగా గుర్తించారు. లింగమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. శిశువు మృతదేహం ఇక్కడకు ఎలా వచ్చిందో తెలియడం లేదని, నగరంలోని ఏదైనా ప్రైవేట్ ఆస్పత్రి నుంచి తీసుకొచ్చి పడేశారా లేక ఇతరులు ఎవరైనా పడేశారా అని పరిశీలిస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ కిషన్ వివరించారు.

వరి కోత మిషన్ కింద పడి రైతు..



ఇస్లావత్ రావుజ్య మృతదేహం

నర్సంపేట : వరి కోత మిషన్ (హార్వెస్టర్) కింద పడి రైతు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని మగ్దుంపురం గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మగ్దుంపురం గ్రామానికి చెందిన రైతు ఇస్లావత్ రావుజ్య (55) గ్రామ శివారులో వరి కోత మిషన్‌తో వరిపైరును కోయిస్తున్నాడు. కోత మిషన్ వెనకాల ఉన్న రావుజ్యను డ్రైవర్ గమనించకుండా రివర్స్ తీశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రావుజ్య కింద పడడంతో వెనకాల టైర్ తలపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో రావుజ్య తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య జానకి, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నారావుపేట పోలీసులు పేర్కొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో పది మందికి గాయాలు



పిచ్చి కుక్క దాడిలో గాయపడిన వ్యక్తి

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల కేంద్రంలోని అప్పాల వీధిలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఆ వీధిలో నడుచుకుంటూ వెళ్తున్న పది మందిపై దాడి చేసి గాయపర్చింది. వారిని స్థానిక వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స చేయించి ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. గ్రామస్తులు ఆ పిచ్చికుక్కను చంపేశారు.

చెరువులో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

- కంబాలపల్లిలో ఘటన



భాస్కర్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లిలో పెద్దచెరువు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపిక శుక్రవారం కేసు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని భవానీనగర్ తండాకు చెందిన జాటోత్ భాస్కర్ (35) ముత్యాలమ్మ గుడి సమీపంలో గల చికెన్ షాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో భాస్కర్ తన తమ్ముడు రవి, మిత్రులు కోటి, నరేష్, రమేష్, వెంకటేష్, రాజుతో కలిసి గురువారం కంబాలపల్లి పెద్ద చెరువు వద్దకు వెళ్లారు. అందరితో పాటు భాస్కర్ కూడా ఈత కొట్టేందుకు పెద్ద చెరువులోకి దిగాడు. ఈత కొడుతూ కొంత దూరం వెళ్లాక గమనించిన తోటి మిత్రులు అతడిని బయటికి రమ్మని పిలిచిన పట్టించుకోకుండా ఉన్నాడు. అంతలోనే భాస్కర్ నీటిలో మునిగి కనిపించకుండా పోగానే వెంటనే వారు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సహాయంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాలించారు. శుక్రవారం ఉదయం భాస్కర్ మృతదేహం నీటిపై తెలియాడుతూ కనిపించడంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు రవి ఫిర్యాదు మేరకు ట్రెయినీ ఎస్సై పి.నరేష్, కానిస్టేబుల్ లింగారావు కేసు నమోదు చేశారు.



అనాథలైన స్వరూప, రిషిత, వర్షిత

అనాథలైన ముగ్గురు కుమార్తెలు..

భాస్కర్ మృతితో అతడి ముగ్గురు కుమార్తెలు అనాథలుగా మారారు. మద్యానికి బానిసైన భాస్కర్ కుటుంబ తగదాలతో 2022లో తన భార్య కల్పనను జిల్లా కేంద్రంలోని అడ్వకేట్స్ కాలనీ కట్టెలమ్మండె సమీపంలో ఆమె గొంతుకోసి హత్య చేశాడు. అదే కేసులో భాస్కర్ జైలుకు వెళ్లగా అప్పటినుంచి కుమార్తెలు స్వరూప, రిషిత, వర్షిత కొద్దిరోజులు అమ్మమ్మ ఇంటి వద్ద, నాయనమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. రెండేళ్ల క్రితం తల్లి కల్పన, ప్రస్తుతం తండ్రి భాస్కర్ మృతితో ముగ్గురు కుమార్తెలు అనాథలుగా మారారు.

అదృశ్యమైన బాలుడు చెరువులో శవమై..

- అనుమానాస్పదంగా చిన్నారి మృతి
- లక్ష్మణ్‌తండాలో విషాద ఛాయలు



జాన్‌పాల్ (ఫైల్)

గూడూరు : రెండ్రోజుల క్రితం తండ్రితో ఆటోలో వస్తూ కనిపించకుండా పోయిన బాలుడు శుక్రవారం చెరువులో శవమై తేలాడు. మండలంలోని చిన్న ఎల్లాపురం శివారు లక్ష్మణ్‌తండాకు చెందిన బాలుడు వాంకుడోత్ జాన్‌పాల్ (6) తండ్రి కృష్ణమూర్తితో కలిసి ఆటోలో వస్తూ కనిపించకుండా పోయాడు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి బాలుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు గాలిస్తుండగా, సీతానగరం శివారు రాళ్ల చెరువులో శవమై కనిపించాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాలుడి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాలుడి మృతి అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నీటి సంపులో పడి చిన్నారి..

- సాయినగర్‌లో విషాద ఘటన



ఆర్యన్ (ఫైల్)

ఎల్కతుర్తి : ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న ఓ చిన్నారి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందిన సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం సాయినగర్ నూతన గ్రామ పంచాయతీలో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. (కొత్తపల్లి) సాయినగర్ గ్రామానికి చెందిన కూన రాకేశ్–రవళి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాకేశ్ వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. తల్లి రవళి వంటపనిలో నిమగ్నమైంది. కుమారుడైన ఆర్యన్ (11 నెలల బాలుడు) ఇంటి ఆవరణలో అరుగుపై ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడ్డాడు. బాలుడిని ఎవరూ గమనించకపోవడంతో ఆర్యన్ మృతిచెందాడు. ఇంటికొచ్చిన బాలుడి తండ్రి రాకేశ్ నీటి సంపు దగ్గరకు వెళ్లగా.. అందులో ఆర్యన్ మృతదేహం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు